# గట్టెక్కించిన చిట్కా

ఏమండోయ్! చూసారా ఇదీ! మళ్లీ కాసులపేర్లు ఫేషనయి పోయాయండోయ్! ఇంత పొడుగుందా? ఎన్ని కాసులనుకుంటున్నారు? అయిదు కాసులట! మూడు, నాలుక్కాసులో కూడా నాజూగ్గా, చక్కగా చేస్తున్నారుట. ఎంత చిత్రమో చూడండి! మా బామ్మ మెళ్లో పాతిక్కాసుల కాసులపేరుండేది. ధరలు పెరిగిపోవడంతోపాటు తక్కువ, తక్కువ బంగారాలతో పెద్ద, పెద్ద నగలు చెయ్యడం కూడా నేర్చుకున్నారీ కంసాలాళ్లు, మొన్న మీనాక్షి మూడు గ్రాములకి గొలుసు చేయించుకొచ్చింది. ఎంత బాగుందనుకున్నారు! అంటూ చెప్పుకుపోతోంది శాలిని.

అనంతం తింటోన్నది సాంబారన్నమే అయినా అది గొంతుక దగ్గరే ఆగిపోయి, దిగనని మొరాయించింది. అతని కంగారుకి కారణం లేకపోలేదు.

శాలినికి నగల పిచ్చెక్కువ. చూసిన నగల్లా చేయించుకోవాలన్న పిచ్చి సరదా వున్నా, ఆ సరదా అన్నదానికి కూడా అంతూ పంతూ వుండాలనుకుంటాడు అనంతం. పైగా తమ తాహతుని బట్టి మసులుకోవాలనుకునే స్వభావం అనంతంది.

అనంతం తాలూకా ఆఫీసులో గుమాస్తా! గవర్నమెంటు ఇచ్చిన జీతం జీతంలాగే సంసారానికి ఖర్చయిపోతుంది. పైనొచ్చే పైసా, పరకా, ఓవర్‌టైమ్ చేస్తే వచ్చే డబ్బులు తెచ్చి భార్యపేర బ్యాంకిలో వేస్తున్నాడు. అలా, అలా కొన్నాళ్లు దాచి, ఓ చిన్న ఇల్లు కొని అందులోకి అందమైన ఫర్నిచర్, ఫ్రిజ్, మిక్సీ వగైరాల్లాంటివన్నీ సమకూర్చుకుని అనుభవించి, ఆనందించాలని అతని కోరిక.

కానీ శాలిని అతని కోరికల్ని కోరికలుగానే మిగిల్చివేస్తోంది. ఆఖరికి ఇంట్లో వంటకి నాలుగు స్టీలుపాత్రలు కూడా కొననివ్వలేదు.

"ఎందుకండీ! అనవసరంగా బోల్డు డబ్బేసి ఆ స్టీలు గిన్నెలు కొనడం! బట్టలు పాతబడిపోతే అవి ఇచ్చి కొనొచ్చు!" "మిక్సీ కొందాం" అంటే ఎందుకా మిక్సీ వెయ్యి రూపాయలు తగలేసి కొనడం! అందులో ఏది పాడయినా దాని రిపేర్లకి బోల్డు సొమ్ము దాని ముఖాన్ని పెట్టాలి అనేది. అలాగే ఫ్రిజ్ కొందాం వేసవికాలం హాయిగా అన్నీ చల్లగా తాగొచ్చు, తినొచ్చు అంటే, నాలుగువేలు తగలేసి ఫ్రిజ్ ఎందుకు? అది ఉపయోగపడేది వేసవి నాలుగైదు నెల్లేకదా? మిగతా సీజనంతా దండగే. పైగా బోల్డు కరెంటు ఖర్చు కూడాను! అనేది ఇలా

అనంతం ముచ్చటపడే ప్రతిదానికి ఏవో కారణాలు, అడ్డంకులు చెప్పి కొననిచ్చేది కాదు. పోనీ అవన్నీ వద్దుగాని ఓ చోట చిన్న ఇల్లు కొనుక్కుందాం అంటే - ట్రాన్స్‌ఫర్ ఉద్యోగంవాళ్లం మనకెందుకు ఇల్లు? రిటైరయ్యాక చూసుకోవచ్చు - తీరా ఇక్కడ కొన్నాకా బదిలీ అయిపోతే అద్దెలకున్నవాళ్లు ఇల్లంతా నాశనం చేస్తారు. దాని రిపేర్లకి మళ్లీ రెట్టింపు అవుతుందంటూ ఆ ఆలోచననీ విరమింపజేసింది శాలిని.

కిక్కురుమనలేని అనంతం మాత్రం ఆమెని బంగారం కొననివ్వకుండా ఆపుచెయ్యలేక పోతున్నాడు. ఆఖరికో రోజు ధైర్యం చిక్కబట్టుకుని అంతంత బంగారం మన కెందుకు శాలిని! అన్నమాటలకి వెంటనే అదేమిటండీ! డబ్బుకి విలువ తగ్గిపోతోంది. బంగారం ఖరీదు రోజు, రోజుకీ పెరిగిపోతోంది - నేను నాలుగేళ్ళ క్రితం వెయ్యి రూపాయలకి కొన్న కాసు ఇప్పుడు పదిహేనొందలయింది! అలా చేతిలో వున్నప్పుడల్లా బంగారం కొని పడేస్తుంటే దాని ఖరీదు పెరుగుతోందే తప్ప తరగటం లేదు! అంటూ అతన్ని మళ్లా మాట్లాడనివ్వకుండా చేసింది. ఆ దెబ్బతో అతను శాలిని చెప్పేవన్నీ విని ఊ కొట్టడం తప్ప ఏం మాట్లాడలేకపోయేవాడు. కాని అతని తోటివాళ్లంతా చిన్న ఇల్లు కట్టుకోడం, ఇంట్లో సామాను కూర్చుకోడం వంటివి చేస్తూంటే అనంతంలో కూడా ఆ కోరిక బలపడసాగింది. కానీ శాలిని అతన్నామాటలు తలవనన్నా తలవనిచ్చేది కాదు. పైగా అనంతం తనతోటి వారి గురించి చెప్పడం ప్రారంభించగానే, తను కూడా ఇరుగుపొరుగులు చేయించుకునే నగల గురించో, లేదా తన అదృష్టాన్ని కొనియాడి, 'నీ భర్త చాలా ఉత్తము'డని పొగుడుతున్నారనో చెప్తూ అనంతాన్ని ఉబ్బెయ్యడానికి ప్రయత్నించేది. ఏ రకంగానూ శాలిని కొరుకుబడకపోవడంతో గతిలేక అనంతమే నోరుమూసుకుని కూర్చునేవాడు. కానీ అతనిలోని కోరికల్ని మాత్రం సమాధి చెయ్యలేకపోతున్నాడు. అందుకు మార్గాలని అన్వేషించసాగాడు. ఎలాగైనా తన స్నేహితుల్లా తనూ ఓ చిన్న ఇల్లు కొనుక్కోవాలన్న కోరిక రోజు రోజుకీ అతనిలో బలపడసాగింది. ఒకరిద్దరి స్నేహితుల్తో భార్యచేత బంగారాన్ని కొనిపించడం ఎలా మాన్పించాలా? అని ఆలోచించాడు - కూడా. "ఇకనుంచి నీ భార్యపేర డబ్బెయ్యకు. దాంతో ఆమె నీకు తెలీకుండా ఆ డబ్బుతీసి నగలు చేయించుకోవడం మానేస్తుంది" అని సలహా ఇచ్చారు. అదీ బాగుందనుకుని వేరే ఎకౌంటు తెరుచుకుని డబ్బు తనపేర దాచసాగాడు.

అకస్మాత్తుగా ఓ రోజు అనంతాన్ని నిలబెట్టి "ఈ మధ్య నా ఎకౌంటులో డబ్బెయ్యటం లేదు. ఏం చేస్తున్నారు?" అంటూ శాలిని అడిగిన దానికి, "పై రాబడి తగ్గిపోయిం"దన్నాడు నసుగుతూ. అయితే ఓవర్‌టైమ్ డబ్బేది? అని నిలదియ్యగానే తెల్లముఖంవేసి చూస్తున్న అనంతం ముందుకి అతను తనపేర వేరేగా ఎకౌంటు తెరిచి దాచిన పాస్‌బుక్కు విసిరి ఎందుకో అబద్దాలు? పెళ్లాం దగ్గరే దాపరికాలెప్పటినుంచి? ఎంత చాటుగా మీ బట్టల మధ్య దాచుకుంటే మాత్రం నాకు కనబడదనుకున్నారా? అందుకే పెద్దవాళ్లు దొంగతనం, మరోటీ దాగదన్నారు! అంటూ నానా హంగామా చేసింది. పట్టుబడ్డ దొంగలా నోరుమూసుకోవడం తప్ప మారుమాట్లాడలేని అనంతం మర్నాడే ఆ డబ్బుని శాలిని ఎక్కౌంటుకి మార్చి తన

ఎకౌంటు క్లోజ్‌చేసి పారేసాడు. ఆనాటి లగాయతూ మళ్లీ డబ్బు పోగవగానే నగలు చేయించుకుంటూ, తన తెలివికి తనే సంబరపడి, పొగుడుకుంటూ, బంగారం కొన్నందువల్ల వుండే లాభాలని భర్తకి చెప్పి మురిసిపోయేది. పైగా ఇరుగు, పొరుగులు తన అదృష్టాన్ని చూడలేక ఎలా అసూయపడుతున్నారో చెప్పి ఆనందించేది. మూగవాడిలా అనంతం ఆమె చెప్పేవన్నీ విని బాగుంది అనడం మాత్రం అలవర్చుకున్నాడు.

చిన్న, చిన్న నగలనుంచి ఇప్పుడు పెద్ద పెద్ద నగల మీదకి మళ్లింది శాలిని దృష్టి. కాసుల పేరయ్యాక వడ్డాణం. తరవాత రవ్వల దుద్దులు. తరవాత రవ్వల నెక్లెస్సు అని వరసపెట్టి చెప్తున్న లిస్టు వింటున్నప్పుడు గుండె ఆగినంత పనయ్యేది అనంతానికి. నగల వ్యామోహం పెరుగుతున్న కొద్దీ, ఇంట్లో సరైన బట్టలు కొననివ్వకపోవడమే కాకుండ, ఆఖరికి తిండి ఖర్చుకూడా తగ్గించేసింది శాలిని. రోజుకొక్కసారే కాఫీ ఇచ్చేది. పిండివంటల మాట ఎత్తవద్దనేది. నూనె, నెయ్యి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయనేది. అన్నంలోకి కూడా ఒక పదార్థం తప్ప వండేదికాదు. భార్య నడత అనంతానికి చాలా చిరాకేసేది. ఇప్పటికి శాలిని పాతిక తులాల దాకా బంగారం కొంది. ఇంకా తృప్తి తీరినట్లు లేదు. చేతిఖర్చుకి చిల్లిగవ్వ ఇచ్చేదికాదు. ఇచ్చినా వాటి ఖర్చులు పైసలతో చెప్పవలసిందే! రోజల్లా కష్టపడి వచ్చే అనంతానికి సరియైన తిండయినా వుండేది కాదు.

ఇరుగుపొరుగులు శాలిని చూపే నగల గురించి వారి వారి భర్తలకి చెప్పడంతో, అనంతం పుట్టి లంచగొండి అనీ, లేకపోతే గుమాస్తా ఉద్యోగంలో ఎవరు పెళ్లానికన్ని నగలు చేయించగలడని వారి భార్యల్ని పూరడించేవారు. అందులో కొందరు అనంతం ముఖం మీదే ఈ విషయమన్నారు కూడ. అది అలా వెళ్లి వెళ్లి అనంతం ఆఫీసు దాకా కూడా పాకిపోవడంతో అతని గుండెల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరిగెత్తసాగాయి. ఇదిలా విషమించి ఉద్యోగం వూడే రోజు కూడా వస్తుందేమో అని గాబరాపడసాగాడు. ఆ మాటే శాలిని దగ్గర అనబోతే మీకంతా గాబరా, కంగారూ ఎక్కువండి! ఎవడేం చేస్తాడు? అవన్నీ మా పుట్టింటారు చేయించారని చెప్తాను. రానివ్వండి ఎవడొస్తాడో?! అని కొట్టి పారేసింది. ఇక శాలినితో మాట్లాడి ప్రయోజనం లేదన్న నిశ్చయాని కొచ్చేసాడు అనంతం. ఇక జరిగేదేదో జరుగుతుందని దేముడిమీద భారంవేసి వూరుకున్నాడనంతం.

పేరంటాళ్లన్నీ ముగించుకుని ఇంటికి బయలుదేరేసరికి చీకటి పడింది. ఇంకా రెండు సందులు దాటితేగానీ ఇల్లురాదు. శాలిని గబగబా నడుచుకుంటూ వెళ్లసాగింది. వెనకనుంచి సైకిల్ మీదొచ్చిన ఓ వ్యక్తి శాలిని పక్కనుంచే రాసుకుని పోతూ ఆమె మెడలోని గొలుసుని లాగబోయాడు. ఇంతలో ఆమె పెట్టిన కేకలకి ఆ సైకిల్ ఆసామీ మరో సందులోకి పారిపోయాడు.

ఆమె కేకలు విని బైటికొచ్చిన జనం ఆమె అన్ని నగలేసుకుని చీకట్లో వంటరిగా వెళ్తున్నందుకు ఆమెనే నిందించారు. దాంతో శాలినికి నగలేసుకుని బైటికెళ్లాలంటేనే దడ

ప్రారంభమయింది. పైగా నగల గురించి జరిగే హత్యల గురించి అనంతం రోజూ పేపరు చదివి చెప్పే వార్తలు వింటుంటే శాలినికి చమటలు పోసేవి. కానీ పైకి ఏమీ తేలకుండా వూరుకునేది. ఏ మాత్రం తన భయాన్ని భర్త ఎదుట వ్యక్తపరిచినా ఇక తన్ని నగలు చేయించుకోనివ్వడన్న భయంతో - ఆనాడు సైకిల్ ఆసామీ గొలుసు లాగిన విషయం కూడా అనంతానికి చెప్పలేదు.

క్యాంపెకెళ్లిన అనంతం టెలిగ్రాము చూసుకుని వెంటనే ఆదరా, బాదరాగా ఇంటికొచ్చాడు. తలుపుతీసి ఘొల్లుమంటూ గోలపెడుతున్న శాలినిని వూరుకోపెట్టడం అనంతంవల్ల కావటం లేదు. ఏడ్చి, ఏడ్చి అలిసిపోయిన శాలిని అనంతానికి జరిగిన కథ చెప్పడం ప్రారంభించింది. అతను టూర్ కెళ్లిన మర్నాడు సాయంకాలం ఎవరో ముగ్గురు వ్యక్తులు తలుపుకొట్టి, మీ పేరడిగారని, మీ స్నేహితులనుకుని తలుపు తియ్యగానే అందులో ఇద్దరొచ్చి నా నోరు నొక్కి, నన్నోమూల తాడేసి కుర్చీకి కట్టేసారని, మూడోవాడు తలుపులోపల గడియపెట్టి కత్తి చూపించి 'అరిస్తే చంపేస్తా'మని బెదిరించాడని, మొదటి ఇద్దరూ బీరువా తాళాలడిగి తీసుకుని మొత్తం నగలు, విలువైన సరుకులు మూట గట్టుకున్నారని, పైగా తన వంటిమీదున్న నగలు కూడా తీసుకెళ్లిపోయారని, వెళ్తూ, వెళ్తూ బైట గొళ్లెంపెట్టి మరీ వెళ్లారనీ, మర్నాడు పనిమనిషొచ్చి తలుపులు తీసి నా కట్లు విప్పేదాకా అలా ఏడుస్తూ పడున్నానని చెప్పి గోడు, గోడున ఏడవసాగింది. ఏడుస్తూ అనంతం షర్టుతో ముక్కు తుడుచుకుంది.

అన్నీ విన్న అనంతం పోలీసు రిపోర్టిస్తానంటూ గబగబా బైటికెళ్లిపోయాడు.

వారం, పదిరోజులు పోలీసుస్టేషనమ్మట తిరిగిన మీదట, ఇదిగో అంటూ వాళ్లు రంగంలోకి దూకారని, తెలిసిన పెద్దవాళ్లని పట్టుకుని పోలీసు డిపార్టుమెంటుకి చెప్పించడం వల్ల అనంతం ఇంట జరిగిన దొంగతనం గురించి సీరియస్‌గా దర్యాప్తు జరుగుతోందని చెప్పిన వార్తలు విని శాలిని కాస్త సంబరపడింది.

అప్పుడప్పుడు అంత కష్టపడి చేయించుకున్న నగలన్నీ పోయినందుకు శోకాలెడుతూ కూర్చునేది. ఇరుగుపొరుగుల కళ్లు పడ్డాయని తిట్టిపోసేది. "బంగారం పోతే పోయింది కనీసం నీ ప్రాణాలు దక్కేయి, డబ్బుకోసం భార్యా, భర్తల్ని హత్యకూడా చేసారుట. మనం అదృష్టవంతులం, ఇంకో వూళ్లో డబ్బు, బంగారం తీసుకుని ఆ ఇంట్లో ఆడదాన్ని రేప్ చేసారుట కూడాను. అవన్నీ చూస్తుంటే, మనం చాలా అదృష్టవంతుల మనుకోవాలి. నగలు పోతే మళ్లీ చేయించుకోవచ్చు. అవిపోతే బ్రతకలేం" అంటూ వూరడించేవాడు అనంతం.

ఆ సంఘటన తరవాత శాలిని పుస్తెల్ని తాడుకి గుచ్చి మెళ్లో వేసుకుని, చేతికి గాజు లేసుకోడం ప్రారంభించింది. ఒకటి రెండుసార్లు అనంతం ఓ నాలుగువేలు అప్పుచేసి తెస్తాను కనీసం పుస్తెలతాడు చేయించుకోమని శాలినికి చెప్పాడు. ఆ సంఘటనతో భయపడిపోయిన శాలిని ఒద్దుగాక ఒద్దంది. ఆ రెండు సంఘటనలతో శాలినికి నగలంటేనే దడ వణుకు పుట్టి బైటికెళ్లేటప్పుడు చెవినున్న దుద్దులు సహితం తీసేసి మరీ వెళ్లేది.

'శాలినీ! శాలినీ!' అంటూ రెండు గంటలకో ఆఫీసు నుంచి ఇంటికొచ్చిన అనంతం ముఖంలోని ఆనందం చూసి ఏమిటండీ! అంత సంతోషంగా వున్నారు? అన్న మాటలకి ఆనందం కాదూ? పోలీసులు దొంగల్ని పట్టుకున్నారట. నీ బంగార మంతా దొరికిందిట. కానీ అదంతా కరిగించి ముద్ద చేసారుట. ఆ ముద్దని మనకిచ్చేస్తారుట. దాంతో మళ్లీ నువ్వు నీ నగలు చేయించుకోవచ్చు. దానికి మళ్లీ మనకి మజూరీయే అవుతుందనుకో! ఏం చేస్తాం? ఏదో అసలన్నా దక్కుతోంది అంటూ చెప్పుకుపోతున్న అనంతం మాటల్ని శాలిని ఆనందం పట్టలేక 'నిజంగానా? నిజంగా దొరికిందా?!' అంటూ అనంతం భుజాల్ని పట్టుకుని కుదిపెయ్యసాగింది. నిజమేనే! నీ పాతనగలన్నీ మళ్లీ వచ్చేస్తాయి.

"బాబోయ్ యింక నగలు మాత్రం వద్దండీ! మీరన్నట్టు ఆ దొంగలు నా ప్రాణాన్ని కాపాడి, ఆ బంగారమొక్కటే ఎత్తుకెళ్లిపోయారు. మళ్లీ వీటికోసం మరొకడొచ్చి ఏం చేసినా ప్రమాదం కూడాను! ఇప్పుడు యింత బంగారం వుందని ఊరంతా ఈ దొంగలవల్ల తెలిసిపోయింది. అది మీ చేతికి యివ్వగానే, అటునుంచటే బజార్లోకెళ్లి, అమ్మేసి బ్యాంకిలో ఆ డబ్బేసి రండి. ఎక్కడన్నా మంచి ఇల్లు అమ్మకానికొస్తే ఆ డబ్బుతో కొనేద్దాం. అదయితే ఎవ్వరూ ఎత్తుకు పోరు." అంటూ చెప్పుకుపోతున్న భార్యని చూసి లోపలోపల్లో సంతోషించాడు అనంతం.

స్నేహితులచేత ఆడించిన ఈ నాటకం విజయవంత మయిందన్న సంగతి అనంతానికి, స్నేహితులకి మాత్రమే తెల్సు. అనంతం కోరిక ఇన్నాళ్లకి తీరి చక్కటి సొంత ఇంట్లో వుంటున్నప్పటికీ, శాలిని మాత్రం బోసి మెడతోనే వుంటోంది. అనంతం బ్రతిమాలినా మళ్లీ నగల కొట్టువైపు వెళ్లడం గాని, నగల గురించి తలవడం గాని చెయ్యలేదంటే నమ్మండి.

**- ఆంధ్ర పత్రిక, 4-10-1985**